# గమ్యాన్వేషణ

## గురజాడ శోభా పేరిందేవి

"మైత్రీ!"

బొమ్మల్తో ఆడుకుంటున్న మైత్రి తలెత్తింది..

ముకుంద్ తన చేతిని ఆమె ముందుకు చాపాడు.

దోరగాఉన్న మామిడిపండు, ఓ కాయా చూడగానే బొమ్మని పక్కన పెట్టి గబుక్కున వాటిని అందుకోబోయింది మైత్రి.

"అమ్మా ఆశ! నాతో వస్తేనే ఇస్తా!"

"ఎక్కడికి?"

"మన తోటలోకి!"

"సరే పద!" చటుక్కున లేచింది. తోటవైపు పరుగుదీసింది నెమ్మదిగా అనుసరించాడు ముకుంద్.

జమీలుపోయినా వారికాలంలో కట్టిన ఇళ్ళు వారి సంతతువారు అనుభవిస్తూ ఉంటారు. అలాగే! మైత్రి వాళ్ళ నాన్నగారిది పెద్ద ఇల్లు ఆ ఇంటి వెనకగల తోట కూడా చాలా పెద్దది.

అక్కడికి తీసుకువెళ్ళాక చుట్టూ చూసాడు ముకుంద్.

'ఎవ్వరూ లేరు. చటుక్కున మైత్రిని దగ్గరికి తీసుకుని ముద్దులుపెట్టేసుకోసాగాడు. శరీరమంతా రెండోచేత్తో తడిమేయసాగాడు.

ఉలిక్కిపడింది మైత్రి. ముకుంద్ మీసాలు గుచ్చుకుంటున్నాయి. అతని ముఖం ఎప్పటిలాగలేదు. అతని పట్టులో ఏదో మొరటుదనం కనిపిస్తోంది.

'ఎందుకు బావ ఇలా చేస్తున్నాడు?' 'ఇంతకు ముందు కూడా ఓసారి ఇలాగే చేసాడు. ఇలా చేస్తే అతని దగ్గరనుండి దూరంగా పారిపోవాలన్నంత భయం తనకి ఎందుకు కలుగుతుంది?'

ఈ ప్రశ్నలన్నీ ఆ పసి మనసుని పట్టుకుంటే అతగాడి చేతులు ఆమె మీద విజృంభించసాగాయి.

"బావా నన్నొదులు".

"... ... ..."

"అమ్మకి చెప్తా!"

చటుక్కున తలెత్తాడు ముకుంద్ " చెప్తే నీకే నష్టం"

"ఎందుకు?"

నిన్నే తిడ్తుంది కొడ్తుంది కూడా!

"అదే ఎందుకు?"

"అంతే! సినిమాల్లో చూడటం లేదూ మగపిల్లలు ఎలాంటిపన్లు చేసినా ఆడపిల్లల్నే కదా అందరూ తిడ్తారు".

మైత్రికి అదేమీ అర్థంకాలేదు. కానీ అతని పట్టుసడలింది కనక ఆ పాప పరుగందుకుంది.

"ఇదిగో ఈ పళ్ళు తీసుకో!"

మైత్రివెనక్కి తిరగలేదు.

ఇంట్లోకెళ్ళిన ఆ అమ్మాయి చటుక్కున తల్లిని వాటేసుకుంది.

"అమ్మా ముకుంద్‌ని మనింట్లోంచి పంపించెయ్యి"

"అదేమిటే?"

"వాడు మంచివాడు కాదమ్మా".

"నీకంటే అంత పెద్దవాళ్లే పట్టుకుని వాడు అనకూడదు తెలిసిందా? అయినా వాళ్ళ ఊళ్ళో ఇంత చదువు. చదువుకోవాలని లేవు కనుక ఇక్కడ ఉంటున్నాడు ఇంట్లో ఉన్నవాళ్ళని మర్యాద చెయ్యాలి కానీ మా ఇంట్లోంచి పో అంటామా తప్పుకదూ?"

తల్లివైపు నిస్సహాయంగా చూసింది మైత్రి. తర్వాత తండ్రి గదిలోకెళ్ళింది మైత్రి.

"నాన్నా! నాన్నా! బావని వాళ్ళ ఊరికి పంపించెయ్యవా నాన్నా".

"ఎందుకమ్మా?"

"బాగా అల్లరి చేస్తున్నాడు"

గట్టిగా నవ్వాడు మైత్రి తండ్రి.

"ఎక్కడైనా మీసాలూ గెడ్డాలూ వచ్చి కాలేజీలో చదువుకునేవాళ్ళు అల్లరి చేస్తారా? నీలాంటి చిన్న పిల్లలు చేస్తారుకానీ".

అతను చేస్తున్నది అల్లరేనని అది ఇంకా చెడ్డదని. తెలుసు మైత్రికి! కాని తండ్రికి చెప్పలేని సంగతి అది!

ఆ పాపకి ఏడుపు తన్నుకురాసాగింది. ఎవరికి చెప్పుకోవాలి తన సమస్య? చెప్పినా ఎవరు అర్థం చేసుకుంటారు?

తన గదిలోకెళ్ళి అద్దంలో చూసుకుంది. తనేమైనా కేకా కోవానా కొరుక్కు తినడానికి? మరి ఎందుకు అలా చేస్తాడు?

గౌనులోపల చెయ్యెందుకు పెడ్తాడు? అలా అతను చేస్తే? తనకి చిరాగ్గా ఎందుకుంటుంది?

"మైత్రి"

త్రుళ్ళిపడింది మైత్రి.

"చెప్పావుగా అమ్మకీ నాన్నకీ ఏమన్నారో కూడా విన్నావుగా!"

"... ... ... ..."

"కనక నేను చెప్పినప్పుడల్లా నాతో తోటలోకి వస్తూ ఉండు. నీకు పళ్ళు నాకు ముద్దులు" అనేసి ఆ గదిలోంచి వెళ్ళిపోయాడు.

* * *

ఫస్ట్ రాంక్ వచ్చే మైత్రి చదువులో వెనకపడింది.

చురుకుగా ఉండే ఆ పాప మందకొడిగా తయారైంది.

ఎప్పుడు చూసినా ఏదో భయం! ముకుంద్‌ని చూస్తే భయమూ చికాకూ కూడా! ఇది గమనించి తల్లీ తండ్రీ తిట్టారు. రెండు దెబ్బలు కూడా వేసారు.

దిండులో ముఖం దాచుకుని వెక్కివెక్కి ఏడ్చింది మైత్రి.

అమ్మా నాన్నల్తో ఎన్నిసార్లు ముకుంద్ గురించి చెప్పినా వాళ్ళు లెక్క చెయ్యరు కానీ 'ఇలా అయిపోయావేం?' చదువు వంటపట్టడంలేదేం?' అని మాత్రం సాధిస్తారు. మరో కొత్త సమస్య. ఏమిటంటే ముకుంద్‌ని మైత్రికి చదువు చెప్పమన్నారు. దాంతో చదువుమీద ఇచ్ఛపూర్తిగా చచ్చిపోయింది.

ముకుంద్ ఈ మధ్య తన లాగు గబగబా విప్పేస్తున్నాడు. గౌను కూడా విప్పుతున్నాడు. విప్పి అతనూ విప్పేసి ఏదేదో చేస్తున్నాడు.

ఎందుకలా చేస్తాడు? అలా చేస్తే? అతనికి ఏం వస్తుంది?' ఈ మాట అమ్మా వాళ్ళకి ఎలా చెప్పాలి? చెప్పినా వాళ్ళు నమ్ముతారా?'

ఇంతకు ముందు దాకా హాయిగా రాత్రిళ్ళు నిద్రపట్టేది అమ్మానాన్నల దగ్గర పడుకుంటే! కానీ ఈ మధ్య 'నువ్వు పెద్ద దానివయ్యావు నీ గదిలో నువ్వు పడుకోవాలి' అంటూ ఆ అమ్మాయిని వేరే గదిలో పడుకోబెట్టసాగారు. 'వద్దు నేను మీతోనే పడుకుంటాను' అని ఏడ్చింది. బ్రతిమాలింది. కానీ వాళ్ళు వినలేదు.

'తమ్ముడు చిన్నవాడు కనక మాతో పడుకుంటాడు నువ్వింక పెద్దవాళ్ళతో పడుకోకూడదు. అసలు ఫారిన్ కంట్రీస్‌లో ఆరునెలల పాపాయిని కూడా విడిగా పడుకోబెడ్తారు తెలుసా?" అన్నాడు తండ్రి.

ముకుంద్ డాబా మీద పడుకుంటాడు. బాల్కనీ తలుపు వేసేసి తమ గదిలోకెళ్తారు తల్లీ తండ్రీ. అయినా సరే మైత్రికి భయం ఏ రాత్రివేళో అతను గదిలోకొచ్చి తననేదేదో చేసేస్తాడని! అందుకని రాత్రంతా ఆ పాపకి సరిగ్గా నిద్రరాదు. చీమ చిటుక్కుమన్నా భయం! దానివల్ల తెల్లవారేసరికి తలనెప్పి, నిద్ర.

ఓరోజు రాత్రి బాగా గాలీ, వానగా ఉండడంతో ముకుంద్ డాబా మీద కాక ఇంట్లోనే పడుకోవలసి

> అమ్మా నాన్నల్తో ఎన్నిసార్లు ముకుంద్ గురించి చెప్పినా వాళ్ళు లెక్క చెయ్యరు కానీ 'ఇలా అయిపోయావేం?' చదువు వంటపట్టడంలేదేం?' అని మాత్రం సాధిస్తారు. దాంతో చదువుమీద ఇచ్ఛపూర్తిగా చచ్చిపోయింది మైత్రికి.



వచ్చింది. ఆ సంగతి మైత్రికి తెలీదు. ఆరోజు బాగా జలుబు, దగ్గా ఉండడంతో మందేసి పడుకోబెట్టింది తల్లి. ఆ మందు తాలూకు మత్తువల్ల మగతగా పడివున్న మైత్రికి మీద ఏదో పాకుతున్నట్టుగా తోచి మెలకువచ్చింది.

ముకుంద్ మదపుటేనుగులాగ మైత్రి మీదికి వస్తూ వస్తూ ముందు చేసిన పని ఆ పాపనోరు మూసెయ్యడం!

బయట వానా, గాలి ముకుంద్ మీద పడడం నోరు మూసెయ్యడం ఇదంతా చూసి భయంతో స్పృహతప్పింది మైత్రికి!

మళ్ళీ ఆ పాపకి స్పృహ వచ్చేసరికి ఆసుపత్రిలో ఉంది. తల్లీ తండ్రి ఆతృతగా చూస్తూ నిలబడ్డారు.

భయంగా వాళ్ళందరివైపూ చూసింది మైత్రి. తర్వాత ఆ పాపకళ్ళు చుట్టూ చూసాయి. ఎక్కడైనా ముకుంద్ ఉన్నాడేమోనన్నట్లుగా!

ఇంకెక్కడి ముకుంద్? తన పని పూర్తిచేసుకున్న వెంటనే పలాయనం చిత్తగించేసాడు.

ప్రొద్దున్నెప్పుడో కూతురి మూలుగు విని గదిలోకెళ్ళిన ఆ అమ్మాయి తల్లి ఆ పాప పరిస్థితి చూసి షాక్‌తింది. గబగబా భర్తని తీసుకువచ్చింది.

వాళ్ళిద్దరూ మైత్రిని ఆసుపత్రిలో చేర్చారు.

అప్పుడే తెలిసింది ఆ దంపతులకి మైత్రిని అంత భయంకరంగా బలాత్కరించినదెవరో! అంతేకాదు మైత్రి ముకుంద్‌ని పంపించెయ్యమని పదే పదే ఎందుకు బ్రతిమాలుకునేదో కూడా అర్థమైంది.

తనకి చేతనైన రీతిలో చెప్పింది పాపం ఆ చిన్నారి. కానీ పెద్దవాళ్ళే అర్థంచేసుకోలేదు.

మన దేశంలోని తల్లిదండ్రులంతే!

పిల్లలకి ప్రేమని పంచి, కావలసినవన్నీ కొనిస్తే చాలని అనుకుంటారు.

కానీ వయసొస్తున్న పిల్లలకి కూడా వయసురావడమంటే ఏమిటో, దానివల్ల వారిలో శారీరకంగానూ, మానసికంగానూ ఏ విధమైన మార్పులు వస్తాయో అప్పటి ఆ మార్పుతర్వాత వాళ్ళెలా నడుచుకోవాలో చెప్పరు.

'మాకు మాత్రం మా పెద్దవాళ్ళేమైనా చెప్పారా? మేమే తెలుసుకోలేదూ! అలాగే వాళ్ళూ తెలుసుకుంటారు' అని తేలిగ్గా తీసిపారేస్తారు.

ఆ కాలం వేరు.

ఈ కాలం వేరు.

కానీ పిల్లలని కన్నవారు మాత్రం కాలానుగుణంగా ప్రవర్తించడంలేదు.

అసలు కొన్ని విషయాలను గురించి మాట్లాడడమే పాపం అన్నట్టుగా పెద్దవాళ్ళు ప్రవర్తిస్తారు. పిల్లల మనసులేమిటో తెలుసుకోరు. ఆ మనసుల్లో ఏ రకమైన మథన ఉందో ఊహించే ప్రయత్నమే చెయ్యరు.

పదేళ్ళ ఆడపిల్లలకి తల్లులు రజస్వల కావడం అంటే ఏమిటో దానివల్ల వచ్చేమార్పులేమిటో వివరంగా చెప్తే ఎంత ఉపయోగంగా ఉంటుంది?!

అలాగే మగ పిల్లలకీ తండ్రులు వారి గొంతులో వస్తున్న మార్పునీ, మూతి మీద మొలవబోతున్న మీసాలని గురించీ చెప్పి మానసికంగా కూడా ఆ వయసులో వచ్చే మార్పుని గమనింపచేయాలి.

ఈ కాలం పిల్లలు ఒకళ్ళిద్దరే ఉంటారు. కనుక పెద్దక్కో, పెద్దన్నో చెప్పే ప్రసక్తిలేదు.

నిజంగానే తల్లి తన బిడ్డతో అన్నీ చర్చించి, సందేహాలు ఏమైనా ఉంటే అడగనిచ్చి ఉంటే మైత్రి తనంత తానే తల్లికి తన సమస్య చెప్పి పరిస్థితిని అంత దూరం పోకుండా ఆపగలిగేది.

అలాగే ముకుంద్‌కి కూడా తండ్రి కోరికలను ఎలా కంట్రోల్ చెయ్యాలోచెప్పి, తన చెల్లెళ్ళల్లాగే వేరే ఆడపిల్లలని గౌరవించాలే తప్ప అత్యాచారం చెయ్యకూడదు అని నూరిపోసి ఉంటే ఈ కథ ఇంతదూరం వెళ్ళేది కాదు.

ఏది ఏమైతేనేం మైత్రి మళ్ళీ పాత మైత్రి కాలేదు. మగవాళ్ళని చూస్తూనే గజగజలాడిపోయే ఆమె పరిస్థితిలో మార్పు రాలేదు.

ఈ మైత్రిల్లాంటి పాపల పరిస్థితుల్లో మార్పురావాలంటే ముందు వాళ్ళ తల్లిదండ్రుల్లో మార్పురావాలి సెక్స్ ఎద్యుకేషన్ తప్పనిసరి అని అది నేర్పవలసినది తామేనని గుర్తుంచుకోవాలి. *